ముహర్రం 25, హిజ్రీ 1448, బుధవారం (7 అక్టోబర్, 2026) నాడు

ప్రసారం మరియు పంపిణీ చేయబడిన శుక్రవారం నాటి ప్రసంగం (ఖుత్బా)

# అతను అల్లాహ్ దృష్టిలో ఎంతో గౌరవనీయుడు

"ఇన్నల్ హమ్ద లిల్లాహి, నహ్మదుహూ వ నస్తఈనుహూ వ నస్తగ్ఫిరుహూ, వ నఊజు బిల్లాహి మిన్ షురూరి అన్ఫుసినా వ మిన్ సయ్యిఆతి అఅ్మాలినా, మన్ యహదిహిల్లాహు ఫలా ముదిల్ల లహూ, వ మన్ యుద్లిల్ ఫలా హాదియ లహూ, వ అష్హదు అల్ లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లా షరీక లహూ, వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్.

(యా అయ్యుహల్లజీన ఆమనుత్తఖుల్లాహ హక్క తుఖాతిహీ వలా తమూతున్న ఇల్లా వ అన్తుమ్ ముస్లిమూన్)

(యా అయ్యుహన్నాసుత్తఖూ రబ్బకుముల్లజీ ఖలఖకుమ్ మిన్ నఫ్సిన్ వాహిదతిన్ వ ఖలఖ మిన్హా జౌజహా వ బస్స మిన్హుమా రిజాలన్ కసీరన్ వ నిసాఅన్, వత్తఖుల్లాహల్లజీ తసాఅలూన బిహీ వల్ అర్హామ్, ఇన్నల్లాహ కాన అలయ్కుమ్ రఖీబా)"

**ఆ తర్వాత:** నిశ్చయంగా అత్యంత సత్యమైన మాట అల్లాహ్ గ్రంథం (ఖురాన్). అత్యుత్తమ మార్గం ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చూపిన మార్గం. అన్ని విషయాలలో కల్తీ లేదా నూతన పోకడలు (ధర్మంలో మార్పులు) అత్యంత చెడ్డవి. ప్రతి కొత్త ఆచారం బిద్అత్ (ధర్మ విరుద్ధమైన నూతన ఆచారం), ప్రతి బిద్అత్ మార్గభ్రష్టత్వం, మరియు ప్రతి మార్గభ్రష్టత్వం నరకానికి దారితీస్తుంది.

ఓ ముస్లింలారా! మానవాళి ఏ స్వభావం మీదైతే సృష్టించబడిందో, సర్వ ప్రాణులు ఏ నైజంతోనైతే పుట్టించబడ్డాయో, అందులో ఒకటి: గౌరవం, హోదా, ప్రజల హృదయాలలో మంచి స్థానాన్ని కలిగి ఉండాలనే కోరిక, మరియు సమాజంలో ఉన్నతమైన కీర్తి, మంచి పేరు సంపాదించుకోవాలనే తపన. అయితే ఒక ముస్లిం ఆశించాల్సిన, కష్టపడి సంపాదించాల్సిన అసలైన హోదా, నిజమైన గౌరవం మరియు ఉన్నత స్థానం అల్లాహ్ వద్ద మాత్రమే ఉంది.

మూసా (అలైహిస్సలాం) ను ప్రశంసిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ وَكَانَ عِنْدَ اللَّهِ وَجِيهًا ﴾

"మరియు అతను అల్లాహ్ దృష్టిలో ఎంతో గౌరవప్రదమైనవాడు." (అల్-అహ్‌జాబ్: 69)

అంటే: అల్లాహ్ వద్ద ఎంతో ప్రతిష్ఠ, ఉన్నత స్థానం మరియు స్వీకృతి పొందినవారు. ఇబ్న్ అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) ఇలా అన్నారు: "ఆయన అల్లాహ్ వద్ద ఎంతో ప్రియమైనవారు, ఆయన అల్లాహ్‌ను ఏది అడిగినా అల్లాహ్ ఆయనకు ప్రసాదించేవాడు."

అదేవిధంగా అల్లాహ్ యొక్క ప్రవక్త ఈసా (అలైహిస్సలాం) పరిస్థితి కూడా అలాగే ఉంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ إِذْ قَالَتِ الْمَلَائِكَةُ يَامَرْيَمُ إِنَّ اللَّهَ يُبَشِّرُكِ بِكَلِمَةٍ مِنْهُ اسْمُهُ الْمَسِيحُ عِيسَى ابْنُ مَرْيَمَ وَجِيهًا فِي الدُّنْيَا وَالْآخِرَةِ وَمِنَ الْمُقَرَّبِينَ ﴾

"దైవదూతలు ఇలా అన్నప్పుడు: 'ఓ మరియమ్! నిశ్చయంగా అల్లాహ్ తన వైపు నుండి ఒక శుభవార్తను నీకు ఇస్తున్నాడు. అతని పేరు మసీహ్, మరియమ్ కుమారుడైన ఈసా. అతను ఇహలోకంలో, పరలోకంలోనూ గౌరవనీయుడవుతాడు. దైవసాన్నిధ్యం పొందిన వారిలో ఒకడై పోతాడు.'" (ఆల్ ఇమ్రాన్: 45)

మన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్థాయి, గౌరవం కూడా ఇదే విధంగా ఉండేది. అల్లాహ్ వద్ద ఆయనకు ఎంతో ఉన్నతమైన స్థానం, మరియు ప్రతిష్ట ఉన్నాయి. ఎక్కడైతే అల్లాహ్ పేరు స్మరించబడు తుందో, అక్కడ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పేరు కూడా ప్రస్తావించబడుతుంది. అల్లాహ్ తాలా ఇలా సెలవిచ్చాడు:

﴿ وَرَفَعْنَا لَكَ ذِكْرَكَ ﴾

"మరియు మేము నీ కోసం నీ(పేరుప్రతిష్ఠల) ప్రస్తావన ఉన్నతం చేశాం." (అష్-షరహ్: 4)

ఓ ముస్లింలారా! అల్లాహ్ వద్ద గౌరవాన్ని, ఉన్నత స్థానాన్ని సంపాదించుకోవాలనే తపనను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన అనుచరులలో (సహాబాలలో) స్పష్టంగా వ్యక్తపరిచారు, ఆ నిమిత్తం వారిని జాగురూక పరిచారు. దానిని సాధించడానికి వారిని ప్రోత్సహించారు.

అనస్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: గ్రామ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఉండేవారు, ఆయన పేరు 'జాహిర్'. ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కొరకు గ్రామీణ కానుకలను తెచ్చేవారు, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా ఆయన్ను ఎంతో ప్రేమించేవారు. అయితే ఆయన రూపంలో కొంచెం వికారంగా ఉండేవారు. ఒకరోజు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయన వద్దకు వచ్చారు, అప్పుడు ఆయన బజార్లో తన వస్తువులను అమ్ముకుంటున్నారు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయనకు వెనుక వైపు నుండి వచ్చి, ఆయన కళ్ళు మూసి గట్టిగా కౌగిలించుకున్నారు (జాహిర్ తనను కౌగిలించుకున్నది ఎవరో చూడలేకపోయారు). అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నవ్వుతూ ఇలా అనసాగారు:

»مَنْ يَشْتَرِي هَذَا الْعَبْدَ؟«

"ఈ బానిసని ఎవరు కొంటారు?"

అందుకు ఆ వ్యక్తి (ఆ గొంతు ప్రవక్త గారిదని గుర్తుపట్టి): "ఓ అల్లాహ్ ప్రవక్త! ఒకవేళ మీరు నన్ను అమ్మితే, అల్లాహ్ తోడు నన్ను ఎవరూ కొనరు. (ఎందుకంటే నా దగ్గర అందం లేదు, ధనం లేదు)" అని అన్నాడు. అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు:

»بَلْ أَنْتَ عِنْدَ اللَّهِ غَالٍ«

"కానీ, నువ్వు అల్లాహ్ దృష్టిలో ఎంతో విలువైనవాడివి." (తిర్మిజీ – అష్-షమాయిల్, అల్బానీ దీనిని సహీహ్ అని ధృవీకరించారు).

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచరులలో (సహాబాలలో) 'జులైబీబ్' అని పిలవబడే ఒక వ్యక్తి ఉండేవారు. ఆయన రూపంలో కొంచెం వికారంగా ఉండేవారు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయనకు పెళ్ళి ప్రస్తావన తీసుకురాగా, ఆయన (జులైబీబ్): "అలాగైతే (నా అందం వల్ల) నేను అమ్ముడుపోని వస్తువులా మిగిలిపోతాను (నన్ను ఎవరూ చేసుకోరు)" అని అన్నారు. దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సమాధానమిచ్చారు:

»غَيْرَ أَنَّكَ عِنْدَ اللَّهِ لَسْتَ بِكَاسِدٍ«

"కానీ, నువ్వు అల్లాహ్ దృష్టిలో ఎంతమాత్రం అమ్ముడుపోని వస్తువువి కావు (నువ్వు చాలా విలువైనవాడివి)."

ఆ తర్వాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయనకు అన్సార్ తెగకు చెందిన ఒక స్త్రీతో వివాహం జరిపించారు. (అబూ యాఅ్లా, అల్బానీ దీనిని సహీహ్ అని ధృవీకరించారు).

ఒక ముస్లిం సంపాదించుకోవడానికి శ్రమించాల్సిన, మరియు దాసులు దానికోసం పోటీ పడితే ప్రశంసించబడే అసలైన ప్రతిష్ట, ఉన్నత స్థానం ఇదే. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ وَفِي ذَلِكَ فَلْيَتَنَافَسِ الْمُتَنَافِسُونَ ﴾

"మరియు పోటీ పడేవారు దీని కోసమే ఒకరితో ఒకరు పోటీ పడాలి." (అల్-ముతఫ్ఫిఫీన్: 26)

వుహైబ్ బిన్ అల్-వర్ద్ (రహిమహుల్లాహ్) ఇలా అన్నారు: "అల్లాహ్ వైపునకు సాగే మార్గంలో నీకంటే ముందు ఎవరూ వెళ్ళకుండా చూసుకోగలిగే సామర్థ్యం నీకు ఉంటే, తప్పకుండా ఆ పని చెయ్."

ఓ ముస్లింలారా! అల్లాహ్ వద్ద ప్రతిష్ట, ఉన్నత స్థానం కలిగిన వ్యక్తికి లభించే గొప్ప శుభాలలో ఒకటి: అల్లాహ్ అతని కీర్తిని పెంచుతాడు, అతని పేరును ఉన్నత పరుస్తాడు, మరియు తన సామీప్యాన్ని అతనికి ప్రసాదిస్తాడు. అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉల్లేఖించారు:

»يَقُولُ اللَّهُ تَعَالَى: أَنَا عِنْدَ ظَنِّ عَبْدِي بِي، وَأَنَا مَعَهُ إِذَا ذَكَرَنِي، فَإِنْ ذَكَرَنِي فِي نَفْسِهِ ذَكَرْتُهُ فِي نَفْسِي، وَإِنْ ذَكَرَنِي فِي مَلَإٍ ذَكَرْتُهُ فِي مَلَإٍ خَيْرٍ مِنْهُمْ، وَإِنْ تَقَرَّبَ إِلَيَّ بِشِبْرٍ تَقَرَّبْتُ إِلَيْهِ ذِرَاعًا، وَإِنْ تَقَرَّبَ إِلَيَّ ذِرَاعًا تَقَرَّبْتُ إِلَيْهِ بَاعًا، وَإِنْ أَتَانِي يَمْشِي أَتَيْتُهُ هَرْوَلَةً«

"అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: నా దాసుడు నా యెడల ఏ విధమైన భావం కలిగి ఉంటే, నేను అతనితో ఆ విధంగానే ఉంటాను. అతను నన్ను స్మరించినప్పుడు నేను అతనితోనే ఉంటాను. ఒకవేళ అతను నన్ను తన మనస్సులో స్మరిస్తే, నేను కూడా అతనిని నా మనస్సులో స్మరిస్తాను. ఒకవేళ అతను నన్ను నలుగురి మధ్య (సభలో) స్మరిస్తే, నేను అతనిని వారి కంటే ఉత్తమమైన సభలో (దైవదూతల సమక్షంలో) స్మరిస్తాను. అతను నా వైపునకు ఒక జానెడు దగ్గరైతే, నేను అతని వైపునకు ఒక మూరెడు దగ్గరవుతాను. అతను నా వైపునకు ఒక మూరెడు దగ్గరైతే, నేను అతని వైపునకు బారెడు దగ్గరవుతాను. అతను నా వైపునకు నడుస్తూ వస్తే, నేను అతని వైపునకు పరుగెత్తుకుంటూ వస్తాను." (ముత్తఫఖున్ అలైహి).

అల్లాహ్ వద్ద ప్రతిష్ట (ఉన్నత స్థానం) కలిగిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమిస్తాడు, మరియు అతని పట్ల ప్రేమను ఆకాశాలలో మరియు భూమిపై ఉన్నవారిలో వ్యాపింపజేస్తాడు. అంతేకాక అల్లాహ్ ఎల్లప్పుడూ అతనికి తోడుగా, అతని రక్షణలో మరియు అతని సహాయంలో ఉంటాడు. అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

»إِنَّ اللَّهَ تَبَارَكَ وَتَعَالَى إِذَا أَحَبَّ عَبْدًا نَادَى جِبْرِيلَ: إِنَّ اللَّهَ قَدْ أَحَبَّ فُلَانًا فَأَحِبَّهُ، فَيُحِبُّهُ جِبْرِيلُ، ثُمَّ يُنَادِي جِبْرِيلُ فِي السَّمَاءِ: إِنَّ اللَّهَ قَدْ أَحَبَّ فُلَانًا فَأَحِبُّوهُ، فَيُحِبُّهُ أَهْلُ السَّمَاءِ، وَيُوضَعُ لَهُ الْقَبُولُ فِي أَهْلِ الْأَرْضِ«

"నిశ్చయంగా, అల్లాహ్ ఒక దాసుడిని ప్రేమించినప్పుడు, జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను పిలిచి: 'అల్లాహ్ ఫలానా వ్యక్తిని ప్రేమిస్తున్నాడు, కాబట్టి నువ్వు కూడా అతనిని ప్రేమించు' అని ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు జిబ్రయీల్ అతనిని ప్రేమిస్తాడు. ఆ తర్వాత జిబ్రయీల్ ఆకాశంలో ఇలా ప్రకటిస్తాడు: 'అల్లాహ్ ఫలానా వ్యక్తిని ప్రేమిస్తున్నాడు, కాబట్టి మీరందరూ అతనిని ప్రేమించండి'. అప్పుడు ఆకాశవాసులు (దైవదూతలు) అందరూ అతనిని ప్రేమిస్తారు. ఆ తర్వాత భూమిపై ఉన్న ప్రజల

హృదయాలలో కూడా అతని పట్ల అంగీకారం (గౌరవం, ప్రేమ) ఉంచబడుతుంది." (బుఖారీ మరియు ముస్లిం – ముత్తఫఖున్ అలైహి).

అల్లాహ్ వద్ద ఉన్నత స్థానం కలిగిన వ్యక్తి ఏ స్థాయికి చేరుకుంటాడంటే, అతను ఒకవేళ అల్లాహ్ పై ప్రమాణం చేసి ఏదైనా అడిగితే, అల్లాహ్ అతని గౌరవార్థం, అతని స్థానాన్ని ఉన్నత పరచడానికి అతని ప్రమాణాన్ని తప్పక నెరవేరుస్తాడు. అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

«رُبَّ أَشْعَثَ، مَدْفُوعٍ بِالْأَبْوَابِ، لَوْ أَقْسَمَ عَلَى اللهِ لَأَبَرَّهُ»

"దువ్వుకోని జుట్టుతో, దీన స్థితిలో ఉండి, (ప్రజల) తలుపుల వద్ద నుండి వెళ్లగొట్టబడే ఎందరో వ్యక్తులు ఉన్నారు; కానీ వారు ఒకవేళ అల్లాహ్ పై ప్రమాణం చేసి (ఏదైనా) అడిగితే, అల్లాహ్ వారి ప్రమాణాన్ని తప్పక నిజం చేస్తాడు." (సహీహ్ ముస్లిం).

అల్లాహ్ ఈ మహా గ్రంథమైన ఖురాన్ ద్వారా నన్ను, మిమ్మల్ని అనుగ్రహించు గాక! మరియు ఇందులో ఉన్న ఆయత్‌లు, జ్ఞానోపదేశాల ద్వారా మనందరికీ మేలు చేకూర్చు గాక! నేను చెబుతున్న ఈ మాటలను మీరు వింటున్నారు. నా కొరకు మరియు మీ కొరకు ప్రతి పాపం నుండి అల్లాహ్ క్షమాపణ వేడుకుంటున్నాను. మీరు కూడా ఆయననే క్షమాపణ వేడండి, నిశ్చయంగా ఆయన అమితంగా క్షమించేవాడు, అత్యంత దయామయుడు.

## రెండవ ప్రసంగం

సర్వస్తోత్రాలు అల్లాహ్‌కు మాత్రమే చెల్లుతాయి. ఆయన తర్వాత మరి ఏ ప్రవక్తా లేరు, ఆయనపై శాంతీ శుభాలు కురియు గాక! ఆరాధనకు అర్హుడు అల్లాహ్ తప్ప మరెవ్వరూ లేరని, ఆయన ఏకైకుడని మరియు ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరని నేను సాక్ష్యమిస్తున్నాను. అలాగే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ యొక్క దాసుడు మరియు ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَقُولُوا قَوْلًا سَدِيدًا (70) يُصْلِحْ لَكُمْ أَعْمَالَكُمْ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ وَمَنْ يُطِعِ اللَّهَ وَرَسُولَهُ فَقَدْ فَازَ فَوْزًا عَظِيمًا ﴾

"ఓ విశ్వసించినవారలారా! అల్లాహ్‌కు భయపడండి మరియు తిన్నని (సత్యమైన) మాటలనే మాట్లాడండి. ఆయన మీ కర్మలను చక్కదిద్దుతాడు మరియు మీ పాపాలను క్షమిస్తాడు. ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో, వారు నిశ్చయంగా గొప్ప విజయాన్ని సాధించినట్లే." (అల్-అహ్‌జాబ్: 70, 71)

**ఆ తర్వాత:** ఒక దాసుడు అల్లాహ్ వద్ద ప్రతిష్టను, ఉన్నత స్థానాన్ని సంపాదించుకోవడానికి ఉన్న అత్యంత గొప్ప మార్గాలలో ఒకటి: నిరంతరం ఆయనను స్మరించడం (జిక్ర్ చేయడం), ఆయన నామ స్మరణతోనే మనశ్శాంతిని పొందడం, తన హృదయాన్ని మరియు నాలుకను అల్లాహ్ యొక్క గొప్పతనాన్ని, మహోన్నత్యాన్ని కీర్తించడంలో నిమగ్నం చేయడం, మరియు ఆయన పవిత్ర నామాలను, గుణగణాలను ఎల్లప్పుడూ తలుచుకుంటూ ఉండడం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ فَاذْكُرُونِي أَذْكُرْكُمْ ﴾

"కాబట్టి మీరు నన్ను స్మరించండి, నేను మిమ్మల్ని స్మరిస్తాను." (అల్-బఖరా: 152)

హదీసే ఖుద్సీలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

»وَأَنَا مَعَهُ إِذَا ذَكَرَنِي«

"అతను (నా దాసుడు) నన్ను స్మరించినప్పుడు నేను అతనితోనే ఉంటాను."

అల్లాహ్ వద్ద ఆ ప్రతిష్టను, ఉన్నత స్థానాన్ని సంపాదించుకోవడానికి గల మరికొన్ని కారణాలు: అల్లాహ్ యొక్క ఇష్టాన్ని, ప్రసన్నతను పొందడానికి ప్రయత్నించడం. ఇది విధిగా చేయాల్సిన పనులను (ఫర్జ్ మరియు వాజిబాత్) నెరవేర్చడం ద్వారా, ఐచ్ఛిక పుణ్యకార్యాలను (సున్నత్ మరియు నవాఫిల్) ఎక్కువగా చేయడం ద్వారా, మరియు నిషేధించబడిన వాటికి (హరామ్) దూరంగా ఉంటూ, అసహ్యకరమైన పనుల (మక్రూహాత్) జోలికి వెళ్లకుండా ఉండడం ద్వారా సాధ్యమవుతుంది.

అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉల్లేఖించారు, అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

»إِنَّ اللَّهَ قَالَ: مَنْ عَادَى لِي وَلِيًّا فَقَدْ آذَنْتُهُ بِالْحَرْبِ، وَمَا تَقَرَّبَ إِلَيَّ عَبْدِي بِشَيْءٍ أَحَبَّ إِلَيَّ مِمَّا افْتَرَضْتُ عَلَيْهِ، وَمَا يَزَالُ عَبْدِي يَتَقَرَّبُ إِلَيَّ بِالنَّوَافِلِ حَتَّى أُحِبَّهُ، فَإِذَا أَحْبَبْتُهُ كُنْتُ سَمْعَهُ الَّذِي يَسْمَعُ بِهِ، وَبَصَرَهُ الَّذِي يُبْصِرُ بِهِ، وَيَدَهُ الَّتِي يَبْطِشُ بِهَا، وَرِجْلَهُ الَّتِي يَمْشِي بِهَا، وَإِنْ سَأَلَنِي لَأُعْطِيَنَّهُ، وَلَئِنِ اسْتَعَاذَنِي لَأُعِيذَنَّهُ«

"ఎవరైతే నా మిత్రుడితో (వలీతో) శత్రుత్వం వహిస్తారో, వారిపై నేను యుద్ధం ప్రకటిస్తున్నాను. నా దాసుడు నేను అతనిపై విధిగా నిర్ణయించిన (ఫర్జ్) కార్యాల కంటే మిన్నగా మరే ఇతర కార్యం ద్వారా కూడా నా సామీప్యాన్ని పొందలేడు (అంటే విధిగా చేయాల్సిన పనులే నాకు అత్యంత ప్రియమైనవి). మరియు నా దాసుడు ఐచ్ఛిక పుణ్యకార్యాల (నవాఫిల్) ద్వారా నిరంతరం నా సామీప్యాన్ని పొందుతూనే ఉంటాడు, చివరికి నేను అతనిని ప్రేమిస్తాను. నేను అతనిని ప్రేమించినప్పుడు, అతను వినే అతని చెవిగా, అతను చూసే అతని కన్నుగా, అతను పట్టుకునే అతని చేయిగా, మరియు అతను నడిచే అతని కాలుగా నేను మారిపోతాను (అంటే అతను నా ఇష్టప్రకారమే వింటాడు, చూస్తాడు, నడుస్తాడు). అతను గనుక నన్ను ఏదైనా అడిగితే నేను అతనికి తప్పక ప్రసాదిస్తాను, మరియు అతను గనుక నా శరణు వేడితే నేను అతనికి తప్పక ఆశ్రయం ఇస్తాను." (సహీహ్ బుఖారీ).

అల్లాహ్ వద్ద ప్రతిష్టను, ఉన్నత స్థానాన్ని సంపాదించుకునే మరికొన్ని మార్గాలలో: లాభదాయకమైన జ్ఞానాన్ని (ధార్మిక విద్యను) నేర్చుకోవడం, దాని ప్రకారం ఆచరించడం, దానిని ఇతరులకు చేర వేయడం, నేర్పించడం. మరియు దానిపై పట్టు కలిగి ఉండడం. దీని ద్వారా ఒక ముస్లిం అల్లాహ్ యొక్క పవిత్రమైన నామాలను (అస్మావుల్ హుస్నా), ఆయన మహోన్నతమైన గుణగణాలను తెలుసుకునే భాగ్యాన్ని, అలాగే ఆయనకు ఏది ఇష్టమో, ఏది ఇష్టం లేదో, ఏది ఆయనకు దగ్గర చేస్తుందో మరియు ఏది ఆయనకు దూరం చేస్తుందో తెలుసుకునే గొప్ప అవకాశాన్ని పొందుతాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ يَرْفَعِ اللَّهُ الَّذِينَ آمَنُوا مِنْكُمْ وَالَّذِينَ أُوتُوا الْعِلْمَ دَرَجَاتٍ ﴾

" మీలో (సత్యాన్ని) విశ్వసించి (ధర్మ)జ్ఞానం ప్రసాదించబడిన వారికి అల్లాహ్ ఉన్నత హోదాలు ప్రసాదిస్తాడు. " (అల్-ముజాదిలా: 11)

అల్లాహ్ దాసులారా! ఒక విషయాన్ని బాగా తెలుసుకోవాలి: ఒక ముస్లిం తన దుఆ (ప్రార్థన) లో ఏ ప్రవక్త యొక్క హోదాను గానీ లేదా ఏ పుణ్యాత్ముడి (సాలీహీన్) ప్రతిష్టను గానీ వసీలాగా (మాధ్యమంగా) చేసుకోవడం ధర్మసమ్మతం కాదు. కాబట్టి "ఓ అల్లాహ్! నేను ముహమ్మద్ ప్రవక్త అంతస్తు (హోదా) తో లేదా ఫలానా వ్యక్తి హోదాతో నిన్ను వేడుకుంటున్నాను" అని అనడం నిషిద్ధం (తగనిది). ఎందుకంటే ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవిత కాలంలో గానీ, ఆయన మరణానంతరం గానీ ప్రవక్త సహాబా (రజియల్లాహు అన్హుమ్) ఎన్నడూ ఇలా చేయలేదు. వారి మధ్య ప్రసిద్ధి చెందిన ఏ ప్రార్థనలలోనూ (దుఆలలో) ఇటువంటి విధానం కనబడదు. ముస్లింలు తమ ప్రార్థనలలో ఖురాన్ మరియు

సున్నత్‌లలో పేర్కొనబడిన పద్ధతుల ద్వారానే అల్లాహ్ వైపునకు మాధ్యమాన్ని (తవస్సుల్) వెతుక్కోవాలి. అంటే, అల్లాహ్ యొక్క పవిత్ర నామాలను స్మరిస్తూ వేడుకోవడం, లేదా తాము చేసిన సత్కార్యాలను (పుణ్యాలను) ప్రస్తావిస్తూ వేడుకోవడం వంటి ధర్మసమ్మతమైన వసీలాలను మాత్రమే ఉపయోగించాలి.

ఓ అల్లాహ్! నీ దాసుడు మరియు ప్రవక్త అయిన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై శాంతి శుభాలు కురిపించు. ఆయన సన్మార్గ నిర్దేశక ఖలీఫాల (ఖులాఫాయె రాషిదీన్) పట్ల, విశ్వాసుల మాతృమూర్తులైన ఆయన భార్యల పట్ల, ఆయన సహాబాలందరి పట్ల మరియు తీర్పు దినం వరకు వారిని చక్కగా అనుసరించే వారందరి పట్ల నువ్వు ప్రసన్నుడవు గాక!

ఓ అల్లాహ్! నిన్ను స్మరించడంలో, నీకు కృతజ్ఞతలు తెలుపుకోవడంలో మరియు నీకు చక్కగా ఆరాధనలు చేయడంలో మాకు సహాయం చేయి. ఓ అల్లాహ్! మా మాతృభూములలో మాకు శాంతిని ప్రసాదించు, మరియు మా దేశాలలో శాంతిభద్రతలను, స్థిరత్వాన్ని నిరంతరం కొనసాగించు. ఓ అల్లాహ్! మా అమీర్ (పాలకుడు) ను మరియు అతని యువరాజు (వలీ అహద్) ను నీ సన్మార్గం వైపునకు నడిపించు, వారి కార్యాలను నీ ప్రసన్నతకు అనుగుణంగా మార్చు, వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని, క్షేమాన్ని, విశ్వాసాన్ని (ఈమాన్) ప్రసాదించు. ఈ దేశాన్ని మరియు మిగతా ముస్లిం దేశాలన్నింటినీ శాంతియుతంగా, సురక్షితంగా ఉంచు.

**మా చివరి పలుకు: సర్వలోకాల ప్రభువైన అల్లాహ్‌కే సర్వస్తోత్రాలు.**